# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ గురువారం 05 జూన్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## ఇఫ్లూలో పీజీ డిప్లొమా, పీహెచ్‌డీ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల




బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్లూ) లో వివిధ పీజీ డిప్లొమా కోర్సులతోపాటు పీహెచ్‌డీ ప్రవేశాలకు అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాలని పేర్కొన్నారు. దరఖాస్తు ఫారం లింక్, ఇతర వివరాలను యూనివర్సిటీ వెబ్‌సైట్ www.efluniver-sity.ac.in లో చూసుకోవచ్చని స్పష్టం చేశారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 21వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు 040 – 27689647, 27689481, 27689733 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.





# విజయోత్సవాల్లో విషాదం

**ఐపీఎల్‌లో ఆర్సీబీ గెలుపొందడంతో బెంగళూరు చిన్నస్వామి స్టేడియంలో అభినందన సభ**

**స్టేడియం వద్ద తొక్కిసలాట 11మంది మృతి.. 47మందికి గాయాలు**

బలగం టీవి, బెంగళూరు

ఐపీఎల్ లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) జట్టు 18 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత విజేతగా నిలవడంతో కర్ణాటక బెంగళూరు నగరంలో ఏర్పాటు చేసిన సంబరాలు తీవ్ర విషాదంగా మారాయి. బుధవారం చిన్నస్వామి స్టేడియం వెలుపల జరిగిన విజయోత్సవ కార్యక్రమంలో భారీగా అభిమానులు తరలిరావడంతో తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ దుర్ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోగా, 30 మందికి పైగా గాయపడ్డారు. ఈ సంఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ఐపీఎల్ ఫైనల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) విజయం సాధించిన నేపథ్యంలో ఆ బృందాన్ని సన్మానించడానికి కర్నాటకలోని బెంగళూరు చిన్నస్వామి స్టేడియంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆ సన్మాన కార్యక్రమానికి వచ్చే తమ అభిమాన ఆటగాళ్లను చూసేందుకు వేలాదిగా అభిమానులు, ప్రజలు స్టేడియానికి పోటెత్తారు. స్టేడియం గేట్లు తెరవగానే ఒక్కసారిగా లోపలికి వెళ్లడానికి ప్రయత్నించారు. దీంతో తోపులాట మొదలైంది. జనాన్ని అదుపు చేయడానికి పోలీసులు లాఠీచార్జి కూడా చేయాల్సిన పరిస్థితి తలెత్తింది. ఇది తొక్కిసలాటకు దారి తీసింది. ఈ విషాద ఘటనలో ఆరేండ్ల బాలికతో సహా 11మంది మృతి చెందగా, 47మంది గాయపడ్డారని అధికారులు చెప్పారు. కాగా, మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని చెబుతున్నారు. తొక్కిసలాట జరిగిన ప్రాంతం వద్ద హృదయ విదారక దృశ్యాలు కనిపిస్తున్నాయి. చెప్పులు చెల్లాచెదురుగా పడివున్నాయి. తొలుత విధానసౌధలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డి.కె.శివకుమార్‌లు క్రీడాకారుల బృందాన్ని సన్మానించారు. అక్కడి నుంచి వారు స్టేడియానికి రావాల్సి ఉంది. ఈలోగానే ఈ విషాదం సంభవించింది. తొక్కిసలాట కారణంగా క్రీడాకారుల సన్మాన కార్యక్రమాన్ని తాత్కాలికంగా నిలిపివేశారు. స్టేడియంవైపు వెళ్ళే మెట్రోలు, ఇతర వాహనాలను కూడా ఆపేశారు.

## ఇంతమంది వస్తారని ఊహించలేదు

- **కర్ణాటక సీఎం సిద్ధరామయ్య**

బలగం టీవి, బెంగళూరు



చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాటలో 11 మంది మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. ఈ దుర్ఘటనపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇంత భారీ సంఖ్యలో ప్రజలు తరలివస్తారని తాము ఊహించలేకపోయామని ఆయన విచారం వ్యక్తం చేశారు. విలేకరులతో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మాట్లాడుతూ, "ఈ దుర్ఘటన మా విజయోత్సాహాన్ని నీరుగార్చింది. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను" అని అన్నారు. మంగళవారం రాత్రి ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్ ఆలస్యంగా ముగియడంతో, రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ ఈ విజయోత్సవాలను ఏర్పాటు చేసిందని, ప్రభుత్వ భాగస్వామ్యంతో కూడా కొన్ని కార్యక్రమాలు నిర్వహించ తలపెట్టామని ఆయన వివరించారు.

"ప్రజల స్పందన మా అంచనాలను మించిపోయింది. విధానసౌధ ముందు లక్షకు పైగా జనం గుమిగూడినా అక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగలేదు. కానీ చిన్నస్వామి స్టేడియం వద్ద ఈ విషాదం సంభవించింది. క్రికెట్ అసోసియేషన్ గానీ, ప్రభుత్వం గానీ ఇంతటి పరిణామం ఊహించలేదు. స్టేడియం సామర్థ్యం 35,000 కాగా, రెండు నుంచి మూడు లక్షల మంది ప్రజలు తరలివచ్చారని అంచనా. స్టేడియం సామర్థ్యానికి అనుగుణంగానే ప్రజలు వస్తారని భావించాం" అని సిద్ధరామయ్య తెలిపారు. తొక్కిసలాటలో మరణించిన వారి కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం అందిస్తామని, గాయపడిన వారికి ఉచితంగా వైద్యం అందిస్తామని ఆయన ప్రకటించారు. అలాగే, గాయపడ్డవారికి ఉచిత వైద్యం అందిస్తామని తెలిపారు. ఈ దుర్ఘటనపై జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో విచారణ జరుగుతుందని తెలిపారు. నిర్లక్ష్యం చేసిన వారిపై చర్యలు తీసుకుంటాం' అన్నారు.

# నేడు కేబినెట్ భేటీ..

**సెక్రటేరియెట్‌లో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సమావేశం**



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన నేడు మధ్యాహ్నం 3 గంటలకు సెక్రటేరియెట్‌లో కేబినెట్ సమావేశం కానుంది. రాజీవ్ యువవికాసం, వానాకాలంలో పంటలు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, భూభారతి, ధాన్యం కొనుగోళ్లతో పాటు కాళేశ్వరం ప్రాజెక్టుపై విజిలెన్స్ ఇచ్చిన రిపోర్టుపై ఈ భేటీలో చర్చించనున్నారు. ఇప్పటికే దీనిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వాలని సీఎం ఆదేశించారు. అలాగే ఉద్యోగుల సమస్యలపై ఏర్పాటైన ఉన్నతాధికారుల కమిటీ తన నివేదికను మంత్రివర్గ ఉపసంఘానికి అందజేసింది. ఈ నివేదికను సీఎం మంత్రులకు భట్టి విక్రమార్క ఇప్పటికే వివరించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం విషయంలో కేబినెట్ లో నిర్ణయాలు తీసుకోనున్నారు. అలాగే త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నది. బీసీ డెడికేటెడ్ కమిషన్ ఇచ్చిన రిజర్వేషన్లకు ఈ కేబినెట్‌లో ఆమోదం తెలిపే అవకాశం ఉన్నది.

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రేపు జరగనున్న కేబినెట్ భేటీలో కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. ఉద్యోగులు, యువత, రైతాంగానికి సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. ఉద్యోగుల డీఏ విషయంలో కీలక నిర్ణయం తీసుకోవచ్చు. ఉద్యోగులు ఐదు డీఏలు కోరుతుంటే ప్రభుత్వం ఒక డీఏ ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేస్తోందని తెలిసింది. రెండో డీఏ విషయంలో చర్చ జరగనుంది. పెండింగు బిల్లుల చెల్లింపుపై ఉద్యోగులు 11 వేల కోట్లు డిమాండ్ చేస్తున్నారు. ఇందులో ఎంత చెల్లించాలనే విషయంపై స్పష్టత రానుంది. ఉద్యోగుల ఆర్థికేతర డిమాండ్లలో 44 డిమాండ్లను అధికారుల కమిటీ ప్రతిపాదించింది. ఈ డిమాండ్లను దాదాపుగా పరిష్కరించనున్నట్టు సమాచారం. రిటైర్మెంట్ వయసు పెంపుపై కూడా నిర్ణయం తీసుకోనున్నట్టు తెలుస్తోంది. రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు రాజీవ్ యువ వికాసం పథకం ప్రారంభించనున్నారు. ఇప్పటికే ఈ పథకం కోసం అప్లికేషన్లు స్వీకరిస్తున్నారు.

## ఉద్యోగ జేఏసీ నేతలతో సమావేశం



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి, మంత్రివర్గ ఉపసంఘం చైర్మెన్ భట్టి విక్రమార్క నేతృత్వంలో ఉద్యోగ జేఏసీతో సమావేశాన్ని నిర్వహించారు. సుమారు రెండుగంటలపాటు సమస్యలపై మళ్లీ చర్చించారు. ఉద్యోగ జేఏసీ నాయకులు మరోసారి సమస్యల గురించి వివరించారు. కానీ మంత్రివర్గ ఉపసంఘం సమస్యలకు సంబంధించి ఎలాంటి హామీ ఇవ్వకపోవడం గమనార్హం. రాష్ట్రంలో ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిలో ఎన్ని డీఏలను ప్రభుత్వం ప్రకటిస్తుందో స్పష్టమైన హామీ ఇవ్వలేదు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు సుమారు రూ.11 వేల కోట్లు వివిధ రకాల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని ఎలా విడుదల చేస్తారో, ఎప్పటిలోగా చెల్లిస్తారో ప్రకటించలేదు. 2023, జులై ఒకటి నుంచి పీఆర్సీ అమలు కావాలి. ఆ నివేదిక ఎప్పుడు వస్తుందో, ఎప్పటి నుంచి అమలు చేస్తారో స్పష్టంగా ప్రకటించలేదు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ స్కీం (ఓపీఎస్)ను అమలు చేస్తామంటూ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. దానిపైనా ఎలాంటి హామీ ఇవ్వలేదు. ఆర్థిక సమస్యలతోపాటు ఆర్థికేతర సమస్యల పరిష్కారంపైనా ప్రభుత్వం నుంచి హామీ రాలేదు. ఉద్యోగుల సమస్యలపై పూర్తిస్థాయిలో అవగాహన ఉందనీ, వాటిని గురువారం జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్న హామీని మాత్రమే భట్టి విక్రమార్క ఇవ్వడం గమనార్హం. దీంతో ఉద్యోగ సంఘాల నాయకులు కొంత అసంతృప్తికి గురయ్యారు. కనీసం డీఏల గురించైనా స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంతో ఈ సమావేశాన్ని నిర్వహించడంలో ఆంతర్యమేంటో అర్థం కాలేదంటూ వారు అసహనం వ్యక్తం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రివర్గ ఉపసంఘం, అధికారుల కమిటీ, ఉద్యోగ జేఏసీ సమావేశాన్ని నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు డి శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు కె కేశవరావు, అధికారుల కమిటీ చైర్మెన్, రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి, సీసీఎల్ఏ మిగితా 2వ పేజీలో



## మా భూములే లాక్కుంటారా?

- **ఇథనాల్ ఫ్యాక్టరీపై పెద్ద ధన్వాడ గ్రామస్తుల ఆగ్రహం..**

బలగం టీవీ, జోగులాంబ గద్వాల్

రాజోలి మండలం, పెద్ద ధన్వాడ గ్రామంలో మరోసారి ఇథనాల్ ఫ్యాక్టరీ అలజడి చెలరేగింది. తమ భూములను లాక్కుని ఫ్యాక్టరీని ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తూ స్థానికులు ఆందోళనకు దిగారు. పది గ్రామాల ప్రజలు కంపెనీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఏకమయ్యారు. గతంలో పనులు నిలిపివేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినా, తాజాగా కంపెనీ యాజమాన్యం మరోసారి పనులను ప్రారంభించడంతో ప్రజల్లో తీవ్ర ఆగ్రహం కట్టలు తెంచుకుంది. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు ఆందోళనకు దిగి, వాహనాలను తగలబెట్టారు. తమ భూములను లాక్కుంటున్నారంటూ రైతులు తిరగబడ్డారు.



## జీహెచ్‌ఎంసీ సర్వ సభ్య సమావేశం

**- వీధి దీపాలు, నాలాల విస్తరణ, వరదల విలయం, ట్రాఫిక్ ఇబ్బందులపై అధికారులను నిలదీసిన కార్పొరేటర్లు**

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో కార్పొరేషన్ 11వ సాధారణ సమావేశం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పాకిస్తాన్ టెర్రరిస్టులు అమాయక ప్రజలను పహల్గాంలో కిరాతకంగా చంపిన సంఘటనకు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దాడిలో మరణించిన కుటుంబ సభ్యులకు సంతాపం తెలుపుతూ మృతిచెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కౌన్సిల్ సభ్యులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ సమావేశంలో వీధి దీపాలు, నాలాల విస్తరణ, వరదల విలయం, ట్రాఫిక్ ఇబ్బందులు సహా పలు అంశాలపై ప్రశ్నలు, సమాధానాలు కొనసాగాయి. కార్పొరేటర్లు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాదానాలు చెప్పారు. ఆ సమయంలో కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా కొనసాగింది. మిగితా 2వ పేజీలో

## అంగన్వాడీ కేంద్రాల్లో ఎగ్ బిర్యానీ

- **మంత్రి సీతక్క**

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో



అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందిస్తున్న ఆహారంలో మరింత పౌష్టిక విలువలు ఉండే విధంగా వారంలో ఒకటి రెండు సార్లు ఎగ్ బిర్యానీ వడ్డించేలా మెనూ మారుస్తామని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క వెల్లడించారు. అంగన్వాడి టీచర్లు హెల్పర్ల పని ఒత్తిడిని తగ్గించేందుకు త్వరలో 14 వేల ఖాళీలను భర్తీ చేస్తామని వివరించారు.అంగన్వాడి కేంద్రాల రూపురేఖలను సమూలంగా మార్చామన్న సీతక్క అంగన్వాడీల్లో 25 శాతం అడ్మిషన్లు పెరిగేలా సిబ్బంది మొత్తం చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. ఇందుకు గాను అమ్మమాట అంగన్వాడి బాట కార్యక్రమాన్ని చేపట్టాలని ఆదేశించారు. అంగన్వాడి కేంద్రం అంటే చిన్నారుల్లో సృజనాత్మకత సృష్టించే వికాస కేంద్రాలుగా తీర్చి దిద్దాలని అన్నారు. రాజేంద్రనగర్‌లోని తెలంగాణ గ్రామీణ అభివృద్ధి సంస్థలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మేదో మదన సదస్సు 2025లో మంత్రి సీతక్క పాల్గొన్నారు. అంగన్వాడి కేంద్రాల్లో అందుతున్న సేవలు, పూర్వ ప్రాథమిక విద్యను పొందుపరుస్తూ రూపొందించిన ప్రీస్కూల్ వీడియోను మంత్రి సీతక్క ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా జరిగిన మేదోమధన సదస్సులో తమ అనుభవాలను, ఆలోచనలను పలువురు డిడబ్లుఓలు, సీడీపీఓలు, సూపర్వైజర్లు పంచుకున్నారు. వక్తలు తెలిపిన అభిప్రాయాలను తెలుసుకున్న అనంతరం మంత్రి ప్రసంగించారు. బడి గంట తరహాలో అంగన్వాడి కేంద్రాల్లోనూ గంట కొట్టే పద్దతి తీసుకురావాలని అన్నారు. అంగన్వాడి కేంద్రాల్లో ఉదయం గంటను మోగించడం ద్వారా చిన్నారుల్లో ఉత్సాహం క్రమశిక్షణ పెరుగుతాయని మంత్రి అభిప్రాయపడ్డారు. అంగన్వాడీ టీచర్లు హెల్పర్లు సకాలంలో వచ్చేందుకు కూడా ఉపయోగపడుతుందని తెలిపారు. మన పని తీరును మెరుగుపరిచేందుకు, మన బెస్ట్ ప్రాక్టీస్ ను విస్తరింప చేసేందుకు ఈ మేదో మదన సదస్సు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. మేదో మదన సదస్సులో మీరు వ్యక్తపరిచిన అభిప్రాయాలను క్రోడీకరించి, నిపుణులు మేధావులతో చర్చించి అంగన్వాడీ ల సేవలను మరింత మెరుగుపరుస్తామని తెలిపారు.

మినీ అంగన్వాడీ టీచర్లకు ప్రమోషన్లు ఇచ్చామని తెలిపారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ను రెట్టింపు చేశామన్నారు. పంచాయతీరాజ్ శాఖలో 93 వేల మిగితా 2వ పేజీలో

## రాజకీయ కక్షతో కేసీఆర్‌కు నోటీసులు



వివరాలు 2వ పేజీలో

**మేఘా కృష్ణారెడ్డిని కమిషన్ ఎందుకు పిలవడం లేదు?**

**ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షులు కవిత     కేసీఆర్‌కు నోటీసులను నిరసిస్తూ మహాధర్నా**



## హైదరాబాద్‌లో ఎవెర్జెంట్ టెక్ ఇన్నొవేషన్ హబ్

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

కలిఫోర్నియా కేంద్రంగా ఉన్న మీడియా, ఎంటర్టైన్‌మెంట్, టెలికో, డిజిటల్ కన్స్యూమర్ రంగాలకు ఏఐ ఆధారిత SaaS పరిష్కారాలు అందిస్తున్న ఎవెర్జెంట్ టెక్నాలజీస్ తమ గ్లోబల్ వ్యాల్యూ సెంటర్‌ను హైదరాబాద్‌లో అధికారికంగా ప్రారంభించింది. ఈ సందర్భంగా సంస్థ ఈ ఏడాదిలోనే మరో 400 మంది ఉద్యోగులను నియమించనున్నట్లు ప్రకటించింది. ఈ కేంద్రాన్ని వ్యూహాత్మక ఉత్పత్తి మరియు ఇన్నొవేషన్ హబ్‌గా స్థాపించిన ఎవెర్జెంట్ ఇప్పటివరకు 600 మందికి పైగా ఇంజనీరింగ్ మరియు ఏఐ నిపుణులను నియమించింది. 2025 నాటికి ఈ సంఖ్యను 1,000కి పెంచే లక్ష్యంతో సంస్థ ముందుకు సాగుతోంది.

తెలంగాణ పరిశ్రమలు మరియు ఐటీ శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారత్‌కు వచ్చే దశాబ్దంలో 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక యాజమాన్యంలో తెలంగాణ తన పాత్రను మరింతగా విస్తరించేందుకు పని చేస్తోందని తెలిపారు. వాల్యూమ్ ఆధారిత వృద్ధి నుండి విలువ ఆధారిత వృద్ధికి టెక్ రంగాన్ని మలచడం కీలకమని, దీనికి ఏఐ, సెమీకండక్టర్లు, డిఫెన్స్, డీప్ టెక్ రంగాల్లో సామర్థ్యాన్ని పెంపొందించడం అవసరమని అన్నారు. ఇలాంటి కేంద్రాల స్థాపన తెలంగాణలో ఉన్న డీప్ టెక్ ప్రతిభను ఉపయోగించి గ్లోబల్ స్థాయి ఉత్పత్తులు, ఐపి (ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ) అభివృద్ధికి దోహదపడుతుందని మంత్రి కార్యాలయం విడుదల చేసిన ప్రకటన పేర్కొంది.

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో గత 18 నెలల్లో రాష్ట్రానికి రూ. 3 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని మంత్రి తెలిపారు. రాష్ట్రాన్ని AI, Machine Learning, Quantum Computing వంటి అభివృద్ధి చెందుతున్న రంగాలకు హబ్‌గా మార్చేందుకు తెలంగాణ కట్టుబడిగా ఉందన్నారు. ఎవెర్జెంట్ సీఈఓ మరియు వ్యవస్థాపకుడు విజయ్ సజ్జా మాట్లాడుతూ, "సిలికాన్ వ్యాలీ మరియు భారతదేశం యొక్క అత్యుత్తమ అంశాలను మిళితం చేసి, మిషన్-క్రిటికల్, ఏఐ ఆధారిత SaaS పరిష్కారాలను రూపొందించాం. హైదరాబాదులో ఉన్న అద్భుతమైన ఇంజినీరింగ్ ప్రతిభే మా ఇన్నొవేషన్‌కు కేంద్ర బిందువుగా ఉంది" అని అన్నారు.NBA, Sky, DirecTV, SonyLIV వంటి గ్లోబల్ మీడియా దిగ్గజాలకు మానిటైజేషన్ సాధించే ఇంటెలెక్చువల్ ప్రాపర్టీని హైదరాబాద్‌లోనే అభివృద్ధి చేస్తోంది. పూర్తిగా భారత్‌లోనే అభివృద్ధి చేసిన తమ ప్లాట్‌ఫాం ద్వారా, 180కి పైగా దేశాల్లో 920 మిలియన్లకు పైగా వినియోగదారులను వారి కస్టమర్ల తరపున జత చేసింది. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ఏఐ ఆధారిత బిజినెస్ ఇంటెలిజెన్స్ డేటాసెట్‌లలో ఒకటిగా నిలిచింది.

# ఉద్యోగ జేఏసీ నేతలతో సమావేశం

(మొదటి పేజీ తరువాయి)

నవీన్ మిట్టల్, సభ్యులు లోకేష్‌కుమార్, కృష్ణభాస్కర్, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, జీఏడీ ముఖ్యకార్యదర్శి మహేష్ దత్ ఎక్కా, ఉద్యోగ జేఏసీ చైర్మెన్ మారం జగదీశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారం తమ బాధ్యత అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఉద్యోగుల సమస్యలపై గురువారం జరిగే మంత్రివర్గ సమావేశంలో నివేదికను సమర్పిస్తామనీ, పరిష్కారం కనుగొంటామని చెప్పారు. సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరించాలనే మంత్రివర్గ ఉపసంఘం, అధికారుల కమిటీని సీఎం రేవంత్‌రెడ్డి నియమించారని గుర్తు చేశారు. సమస్యలపై అందరితో చర్చించి సాధ్యమైనంత త్వరగా పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కొన్నేండ్లుగా బకాయిలు పేరుకుపోవడంతో అన్ని ఒకేసారి చేయలేకపోయామని అన్నారు. ఎక్కువ కాలం వాటిని పెండింగ్‌లో ఉంచకుండా, పరిష్కారం చూపాలన్నదే ప్రభుత్వ ఆలోచన అని వివరించారు. ఉద్యోగులు ప్రభుత్వంలో భాగస్వాములని చెప్పారు. ప్రజలకు చేయాల్సిన పనులు, అందించాల్సిన సంక్షేమ కార్యక్రమాలు, ప్రభుత్వ ఆదాయం, వ్యయం వీటన్నింటితోపాటు ఉద్యోగ వ్యవస్థకు ఇవ్వాల్సినవి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతగా భావిస్తుందని వివరించారు. ఒకవైపు ప్రజలకు మరోవైపు ఉద్యోగులకు ఇబ్బందులు కలగకుండా కలిసి కూర్చుని చర్చించుకుని ముందుకు పోవాలన్న ఆలోచనతోనే ఈ సమావేశాన్ని నిర్వహించామని అన్నారు. పదేండ్ల పాలనతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయనీ, అయినా ఉద్యోగులకు సాధ్యమైనంత మేరకు మేలు చేయాలనీ, సమస్యలను పరిష్కరించాలన్న ఆలోచన లో భాగంగానే మొదటి తారీఖున జీతాలు చెల్లిస్తున్నామని చెప్పారు. వనరులు సమకూర్చుకుని ప్రజలపై అదనంగా ఒక్క రూపాయి భారం పడకుండా ముందుకుపోతున్నామని వివరించారు. ఉద్యోగుల సంక్షేమం కోసం ఆర్థికపరమైన కసరత్తు చేస్తున్నామని అన్నారు. ఉద్యోగుల కుటుంబాల్లో పెండ్లీలు, ఆస్పత్రుల ఖర్చులకు సంబం.ంచిన సమస్యలపై మంత్రివర్గ సహచరులతో అంతర్గతంగా పలుమార్లు చర్చించుకున్నామని వ్యాఖ్యానించారు. అధికారుల కమిటీ, ఆర్థిక శాఖ, ఇతర అధికారులతో చర్చించి ఒక నివేదికను రూపొందించి మంత్రివర్గ సమావేశంలో నివేదిస్తామని వివరించారు.

# అంగన్వాడీ కేంద్రాల్లో ఎగ్ బిర్యానీ

(మొదటి పేజీ తరువాయి)

మంది చిరు గ్రామీణ ఉద్యోగులకు గ్రీన్ ఛానల్‌లో జీతాలు ఇస్తున్నామని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల జీతాలను గ్రీన్ ఛానల్‌లో ప్రతినెలా అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంగన్వాడి కేంద్రాలను అక్షర జ్ఞానానికి, పోషకాహారానికి, ఆరోగ్యానికి, ఆటవిడుపుకు, వికాసానికి కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ప్లే స్కూళ్లకు ధీటుగా అంగన్వాడీలను సిద్ధం చేసి తల్లిదండ్రుల ఆర్థిక భారాన్ని తగ్గిస్తున్నామని తెలిపారు. అంగన్వాడి కేంద్రాలకు నాసిరకం సరుకులు సరఫరా చేసే సప్లయర్స్‌ను బ్లాక్ లిస్టులో పెడుతున్నామని చెప్పారు. అంగన్వాడి లబ్ధిదా రులకు అందిస్తున్న కోడిగుడ్ల విషయంలో జాగ్రత్తలు పాటించాలని అధికారులను ఆదేశించారు. కోడి గుడ్డును ఉడకబెట్టి అలాగే ఇవ్వకుండా, రెండు ముక్కలు చేసి ఇస్తే అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని మంత్రి సూచించారు. మనకున్న బడ్జెట్‌లో అంగన్వాడి కేంద్రాలకు చిన్నారులను ఆకర్షించేందుకు వినూత్న ఆలోచనలతో ఆట వస్తువులు, అభ్యాసన మెటీరియల్ ను రూపొందించాలని మంత్రి సీతక్క ఆదేశించారు.

# రాజకీయ కక్షతో కేసీఆర్‌కు నోటీసులు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాజకీయ కక్షతో కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్ గారికి నోటీసులు ఇచ్చారని ఎమ్మెల్సీ, తెలంగాణ జాగతి అధ్యక్షురాలు కవిత ప్రశ్నించారు. కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారంటే మొత్తం తెలంగాణకు నోటీసులు ఇచ్చినట్టేనన్నారు. కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ నోటీసులు జారీ చేయడాన్ని నిరసిస్తూ తెలంగాణ జాగతి ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్ ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద మహా ధర్నా జరిగింది. ఈ ధర్నాకు ఎమ్మెల్సీ హాజరై మాట్లాడుతూ "కాళేశ్వరం ప్రాజెక్టు అంటే కేవలం మూడు బ్యారేజీలే కాదు ఆ ప్రాజెక్టులో 21 పంప్ హౌస్‌లు, 15 రిజర్వాయర్లు, 200 కిలోమీటర్ల మేర టన్నెల్ లు, 1500 కిలోమీటర్ల మేర కాలువలు ఉన్నాయి. అంత భారీ ప్రాజెక్టు కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయితే 35 శాతం తెలంగాణ భూభాగానికి నీళ్లు అందిస్తుంది. 40 టీఎంసీలతో హైదరాబాద్‌కు శాశ్వతంగా నీళ్లు ఇచ్చే ప్రాజెక్టు కాళేశ్వరం. మన పరిశ్రమలకు 16 టీఎంసీల నీళ్లు అందించే ప్రాజెక్టు కాళేశ్వరం. 90 మీటర్ల అడుగున ఉండే నీళ్లను 600 మీటర్లపైకి ఎత్తిపోసే ప్రాజెక్టు నిర్మించింది కేసీఆర్. కాంగ్రెస్ పార్టీ నాయకులకు కలలో కూడా అంతపెద్ద ప్రాజెక్టును కట్టాలన్న ఆలోచన రాదు.40 లక్షల ఎకరాలకు నీళ్లు అందించే ప్రాజెక్టుపై కుట్ర చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, కేసీఆర్ గారిని బద్నాం చేయడానికి మాత్రమే కాళేశ్వరం కమిషన్ వేసింది.

గతంలో కాంగ్రెస్ హయాంలో జలయజ్ఞం పేరుతో ధనయజ్ఞం చేస్తూ 90 శాతం పనులను మెఘా కష్ణా రెడ్డి కంపెనీకి ఇచ్చారని గుర్తు చేశారు. మేడిగడ్డకు చిన్న చిన్న మరమ్మతులు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం పొలాలను ఎండబెడుతోందని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో 15 పంప్ హౌజ్ పనులు చేసిన మెఘా కష్ణా రెడ్డిని కమిషన్ ముందుకు పిలిచే ధైర్యం రేవంత్ రెడ్డికి లేకపోవడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కమీషన్ల కోసం, కాంట్రాక్టర్ల కోసం మాత్రమే పనిచేస్తోందని ధ్వజమెత్తారు. 90 శాతం పంప్ హౌజ్‌ల పనులు చేసిన కాంట్రాక్టర్‌ను ఎందుకు వదిలేశారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ పౌరుషాన్ని చూపించాల్సిన సమయం వచ్చిందన్నారు.

ఏపీ ప్రభుత్వం చేపడుతున్న బనకచర్ల ప్రాజెక్టును సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు వ్యతిరేకించడం లేదని ప్రశ్నించారు. గోదావరి–పెన్నా అనుసంధానం పేరిట నీళ్లు తరలింపును తక్షణమే అడ్డుకోవాలని, ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కేంద్రానికి లేఖ రాయాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు ఎన్డీఏలో ఉన్నందున జలదోపిడి చేసినా రాష్ట్ర బీజేపీ నాయకులు ప్రశ్నించడం లేదని, 8 మంది ఎంపీలు, 8 మంది ఎమ్మెల్యేలు ఉన్నా రాష్ట్రానికి ఏమీ తేవడం లేదని మండిపడ్డారు. బీజేపీలో ఉన్న ఒకే ఒక తెలంగాణ బిడ్డ ఈటల రాజేందర్ కూడా మాట్లడకపోవడం శోచనీయమన్నారు. బకనచర్ల ప్రాజెక్టును ఆపే ప్రయత్నం చేసే బాధ్యతను, అలాగే కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా తీసుకొచ్చే బాధ్యతను ఆయన తీసుకోవాలని చెప్పారు. గోదావరి నీటిలో వెయ్యి టీఎంసీల హక్కును సాధించే వరకు తెలంగాణ జాగృతి పోరాటం చేస్తుందని తెలిపారు.

# ఎర్రగడ్డ మానసిక ఆరోగ్య సంస్థలో 92 మంది రోగులకు అస్వస్థత

**బలగం టీవి, హైదరాబాద్**



ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రిలో ఫుడ్ పాయిజన్ ఘటనలో మొత్తం 392 మంది రోగులకుగాను 92 మంది వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురైనట్టు నిర్ధారించారు. ఇప్పటికే ఒకరు మృతి చెందిన విషయం తెలిసిందే. 18 మందికి ఉస్మానియా జనరల్ ఆస్పత్రిలో మెరుగైన చికిత్స అందిస్తున్నారు. మిగతా 74 మంది ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రిలోనే ఉస్మానియా జనరల్ ఆస్పత్రి నుంచి వచ్చిన వైద్య బృందం పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు. ఘటనపై ఉన్నతాధికారులు విచారణ ప్రారంభించారు. బుధవారం ఉదయం వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆస్పత్రిని సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫుడ్ పాయిజన్ అయిన సమయంలో డ్యూటీలో ఉన్న ఇన్‌చార్జి సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ పద్మజను విధుల నుంచి తొలగించి ఆమెను డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ వెల్ఫేర్‌లో రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఉస్మానియా జనరల్ ఆస్పత్రి సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బి.శంకర్‌కు ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రి ఇన్‌చార్జి సివిల్ సర్జన్ ఆర్ఎంఓగా బాధ్యతలు అప్పగించారు. కాంట్రాక్టర్ జి.జైపాల్‌రెడ్డి నిర్లక్ష్యం కారణంగానే ఫుడ్ పాయిజన్ జరిగినట్టుగా గుర్తించి ఆస్పత్రిలో డైట్ కాంట్రాక్టును రద్దు చేసి చెస్ట్ ఆస్పత్రి డైట్ కాంట్రాక్టర్‌కు తాత్కాలికంగా అప్పగించారు.

ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రిలో ఫుడ్ పాయిజన్ ఘటనపై వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సీరియస్ అయ్యారు. ఆస్పత్రిని సందర్శించిన మంత్రి సిబ్బందితో మాట్లాడి ఫుడ్ పాయిజన్ ఘటనపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనితపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పెషల్ ఫుడ్ వల్లే రోగులు అస్వస్థతకు గురయ్యారని మంత్రి చెప్పారు. వెంటనే డైట్ కాంట్రాక్టర్ కాంట్రాక్ట్‌ను రద్దు చేయాలని సూపరింటెండెంట్ ను ఆదేశించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫుడ్ వల్లే రోగులు అస్వస్థతకు గురైనట్టు ప్రాథమికంగా గుర్తించినట్టు మంత్రి వెల్లడించారు. డైట్‌లో స్వీట్ ఏర్పాటు చేయడం వల్లే ఇలా జరిగి ఉండొచ్చని భావిస్తున్నావన్నారు. ల్యాబ్ రిపోర్టు వచ్చిన అనంతరం కారణాలను పూర్తి స్థాయిలో వెల్లడిస్తామని చెప్పారు. ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 18 మంది రోగుల పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. ఈ ఘటనలో మృతి చెందిన కిరణ్ మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించామనీ, ల్యాబ్ రిపోర్ట్‌ల ఆధారంగా త్వరలోనే వివరాలు వెల్లడిస్తామని అన్నారు. మానసిక వైద్యశాలలో అస్వస్థతకు గురైన విషయం తెలిసిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీని వేసి పరిస్థితిని పర్యవేక్షిస్తుందని వెల్లడించారు. ప్రజలకు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే ఏ స్థాయి ఉద్యోగులైనా చర్యలు తీసుకునేందుకు ఉపేక్షించబోమని మంత్రి హెచ్చరించారు.

# ఏఐతో భవిష్యత్తులో లాభమే



**అమెరికా డల్లాస్ లో ఐటీ కంపెనీ సీఈఓల సమావేశంలో ప్రసంగించిన కేటీఆర్**

**బలగం టీవీ, అమెరికా**

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తో భవిష్యత్తులో లాభమే జరుగుతుందన్నారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.తారకరామారావు అన్నారు. ప్రభుత్వాలు, ఐటీ కంపెనీలు కలిసి పని చేస్తేనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో మన దేశ యువత పోటీ పడగలుగుతుందన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న కేటీఆర్, అక్కడి ఐటీ కంపెనీల యాజమాన్య ప్రతినిధులతో డల్లాస్ లో సమావేశమయ్యారు. అమెరికాలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల మీద స్పందించిన కేటీఆర్, చిన్న,మధ్య తరహా ఐటీ కంపెనీలు ఇండియాలో ఆఫ్ షోర్ సెంటర్ లను ఏర్పాటుచేసే అవకాశం ఉందన్నారు. మూడేండ్లలో తిరిగి అధికారంలో వచ్చిన తరువాత ఐటి పరిశ్రమను మరింత విస్తృతంగా అభివృద్ధి చేస్తామని కేటీఆర్ భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని తమ ప్రభుత్వం తీసుకొచ్చిన ఐటీ, అనుబంధ పాలసీలతోనే తొమ్మిదేండ్లలో ఐటీ కి హైదరాబాద్ ల్యాండ్ మార్క్ అయిందన్నారు. ఐటి రంగ అభివృద్ధి కోసం ఇన్నోవేషన్, ఇంకుబేషన్ లో తీసుకువచ్చిన విప్లవాత్మకమైన విధానాలతోనే చరిత్రలో ఎన్నడూ లేనంత వేగంగా హైదరాబాద్ ఐటి పరిశ్రమ ఎదిగిందన్నారు. 2014లో హైదరాబాద్ లో కేవలం 3,23,000 ఐటి ఉద్యోగాలు మాత్రమే ఉంటే.. తాము అధికారం నుంచి దిగిపోయే నాటికి ఆ సంఖ్య పది లక్షలకు చేరిందని కేటీఆర్ తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఎన్నో టెక్ కంపెనీలు అమెరికా ఆవల తమ అతిపెద్ద కార్యాలయాలను హైదరాబాద్ లో నెలకొల్పాయన్నారు.

ప్రస్తుతం ఉన్న పరిస్థితుల కారణంగా చాలా టెక్ కంపెనీలు ఇండియాలో తమ ఆఫ్షోర్ సెంటర్లను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తాయన్న కేటీఆర్, ఇండియాలోని టైర్ టూ నగరాలకు ఐటి పరిశ్రమ విస్తరించవచ్చన్నారు. కోవిడ్ తర్వాత ప్రపంచంలో ఏ మూల నుంచి అయినా ఏ కంపెనీ కైనా పనిచేయవచ్చని తెలిసిందన్నారు. బీఆర్ఎస్ 9 ఏళ్ల పాలనలో టైర్ టూ నగరాలకు ఐటి పరిశ్రమను విస్తరించామని కేటీఆర్ తెలిపారు. ఖమ్మం, మహబూబ్ నగర్,నల్గొండ, సిద్దిపేట్, నిజామాబాద్, ఆదిలాబాద్ లాంటి 10 నగరాల్లో ప్రభుత్వం ఐటీ హబ్ లను ఏర్పాటుచేసి మొదటి సంవత్సరం రెంట్ ఫ్రీ, ప్లగ్ అండ్ అండ్ ప్లే ఫెసిలిటీస్ తో పాటు ఎన్నో రాయితీలను కల్పించామని చెప్పారు. అలా ఆదిలాబాద్ లో ఏర్పాటు చేసిన NTT డేటా కంపెనీ 500 మంది ఐటీ నిపుణులతో అద్భుతంగా పురోగతి సాధిస్తుందన్నారు. అమెజాన్, గూగుల్ లాంటి మల్టీనేషనల్ కంపెనీలు టైర్ టూ నగరాలకు వెళ్ళలేవన్న కేటీఆర్, చిన్న, మధ్య తరహా ఐటీ కంపెనీలు మాత్రమే అక్కడికి చేరగలవన్నారు. ఇండియాలోని టైర్ టూ నగరాల్లో అపార అవకాశాలు ఉన్నాయని, మంచి రైల్, రోడ్ కనెక్టివిటీతో రాబోయే రెండు దశాబ్దాల్లో అద్భుతాలు జరుగుతాయన్నారు. అమెరికా హైవేల మీద ఇన్వెస్ట్ చేసినందుకే ధనిక దేశం అయిందన్న ఆ దేశ మాజీ ప్రెసిడెంట్ జాన్ ఎఫ్ కెనడీ మాటల్ని గుర్తుచేసిన కేటీఆర్, దేశాభివృద్ధిలో మౌలిక సదుపాయాల కల్పన ఎంత ముఖ్యమో కేంద్ర ప్రభుత్వంతో పాటు వివిధ రాష్ట్రాల ప్రభుత్వాలు అర్థం చేసుకోవాలన్నారు. మీలాంటి వారి కోసమే ఇండియాలోని యువత ఎదురు చూస్తుందన్న కేటీఆర్, పెట్టుబడులు పెట్టి మాతృభూమి రుణం తీర్చుకోవాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా పలువురు ఐటీ కంపెనీల యాజమాన్య ప్రతినిధులు మాట్లాడుతూ ప్రస్తుతం తెలంగాణలో ఐటి పరిశ్రమ అభివృద్ధి మందగించిందన్నారు. కేటీఆర్ లాంటి విజన్ ఉన్న నాయకుడు లేని లోటు స్పష్టంగా కనిపిస్తుందని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో 9 సంవత్సరాల పాటు ఐటీ రంగానికి చేసిన అభివృద్ధిని ప్రత్యేకంగా ప్రశంసించారు. కేవలం హైదరాబాద్ పైనే కాకుండా ఇతర ద్వితీయ శ్రేణి నగరాలకు కూడా ఐటీని విస్తరింపజేసి చిన్న మధ్య తరహా కంపెనీలకు భారతదేశంలో కార్యకలాపాల నిర్వహణ లాభసాటిగా ఎలా మార్చవచ్చు నిరూపించారని చెప్పారు.

# జీహెచ్ఎంసీ సర్వ సభ్య సమావేశం

(మొదటి పేజీ తరువాయి)

నగరంలో వీధిదీపాల నిర్వహణ అధ్వానంగా మారిందని, ముందస్తుగా ఎందుకు టెండర్లు ఆహ్వానించలేదని కార్పొరేటర్లు అధికారులను నిలదీశారు. నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, జననమరణ ధృవపత్రాల జారీలో అక్రమాలపై విచారణ చేపట్టాలని సభ్యులు డిమాండ్ చేశారు. బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ వేధింపులు తాలలేక సర్దార్ అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నారని, ఆ వ్యక్తి ఫోటోతో బీఆర్ఎస్ సభ్యులు నిరసన తెలిపారు. ఈ సంఘటనపై ఫసియుద్దీన్‌పై ఎఫ్ఐఆర్ నమోదైందని మేయర్ తెలిపారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసినంత మాత్రాను బాబా ఫసియుద్దీన్ దోషికాదని బీజేపీ ఎంసీ రఘునందన్ రావు అన్నారు.సభ ప్రారంభానికి ముందు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కౌన్సిల్ సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. జీహెచ్ఎంసీలో చేపట్టే మౌలిక సదుపాయాల అభివద్ధికి, సంక్షేమానికి నిధుల కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చిన మేరకు ముఖ్యమంత్రి నిధులు మంజూరు చేస్తూ బల్దియా అభివద్ధికి తోడ్పాటు అందిస్తున్నందుకు కతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నగరంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి ప్రస్తావించారు.



## వేములవాడ కోడెల మరణాలు తెలంగాణకు అరిష్టం..

**బలగం టీవీ, సిద్దిపేట**

దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ రాజన్న దేవస్థానంలో గత వారం రోజులుగా వరుసగా కోడెలు మరణిస్తుండటంపై బీఆర్ఎస్ పార్టీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఇది తెలంగాణ రాష్ట్రానికి అరిష్టమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. భక్తులు సమర్పించిన కోడెలు మరణించడం ప్రజల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. "వారం రోజులుగా రోజూ కోడెలు చనిపోతుంటే ప్రభుత్వానికి చీమకుట్టినట్టైనా లేకపోగా, కనీస స్పందన కూడా లేదు" అని హరీష్ రావు విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వానికి కనీసం కోడెలకు గడ్డి పెట్టే పరిస్థితి కూడా లేదా అని ఆయన ప్రశ్నించారు. ఈ నిర్లక్ష్యానికి కారణమేమిటని నిలదీశారు. ఈ విషయంలో కలెక్టర్, ఇతర అధికారులు, దేవాదాయ శాఖ, పశుసంవర్ధక శాఖ ఏం చేస్తున్నాయని హరీష్ రావు ప్రశ్నించారు. వేములవాడ దేవస్థానం పరిస్థితే ఇలా ఉంటే ఎలా అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కోడెలను కాపాడలేని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని హరీష్ రావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతకాకపోతే, కోడెల సంరక్షణ బాధ్యతను బీఆర్ఎస్ పార్టీకి అప్పగించాలని హరీష్ రావు సవాలు విసిరారు. "మీకు ప్రజలంటే లెక్కలేదు, దేవుళ్లంటే లెక్కలేదు" అని అన్నారు. కోడెల మరణాలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి, తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.







## వివాహ వేడుకలకు హాజరైన చల్మెడ..

**బలగం టీవీ, వేములవాడ**

బి.ఆర్.ఎస్. పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు వేములవాడ పట్టణంలో జరిగిన పలు వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. రేగుల దేవేందర్ సోదరుని కుమార్తె వివాహం మహారాజ ఫంక్షన్ హాల్లో వైభవంగా జరిగింది. అలాగే, చక్రాల రామచంద్రం–ఎల్లవ్వల కుమారుని వివాహం పద్మావతి ఫంక్షన్ హాల్లో జరిగింది. సింగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి వివాహం ఎస్.ఆర్.ఆర్. ఫంక్షన్ హాల్లో జరగగా, నాయకులు రామతీర్థపు హరీష్ సోదరుని వివాహం రాజశ్రీ ఫంక్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ అన్ని వివాహ వేడుకలకు చల్మెడ లక్ష్మీనరసింహారావు హాజరై, నూతన జంటలకు శుభాకాంక్షలు తెలిపి, ఆశీస్సులు అందించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవిరాజు, మాజీ కౌన్సిలర్ లు నిమ్మశెట్టి విజయ్, సిరిగిరి చందు, నాయకులు ముద్రకోల వెంకటేశం, నీలం శేఖర్, కొండ కనుకయ్య, వాసాల శ్రీనివాస్, గోసుకుల రవి, కేందే గంగాధర్, మంతెన సంతోష్, ఈర్లపల్లి రాజు, మంతె సందీప్, సాయి పటేల్ తదితరులు పాల్గొన్నారు.



## పండగలా ఇందిరమ్మ నూతన గృహాలకు భూమి పూజ

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

పేదల సొంతింటి కలను నెరవేరుస్తూ, తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ గృహాల నిర్మాణ కార్యక్రమం తంగళ్ళపల్లి మండలంలో పండగలా కొనసాగుతోంది. ఈ రోజు తంగళ్ళపల్లి మండలంలోని బద్దనపల్లి, తంగళ్ళపల్లి, దేశాయిపల్లె గ్రామాలల్లో ఇందిరమ్మ నూతన గృహాల నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తమ చిరకాల స్వప్నమైన సొంతింటి కలను సాకారం చేస్తున్నందుకు, ప్రజా పాలన అందిస్తున్నందుకు వారు హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు తంగళ్ళపల్లి మండలంలో సుమారు 210 ఇందిరమ్మ ఇళ్లకు గ్రౌండింగ్ పూర్తయిందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం కృషి

**-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, వేములవాడ**



ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందుకు పోతుందని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అర్హులైన 65 మంది లబ్ధిదారులకు 28 లక్షల 48 వేల విలువ గల సి ఎం ఆర్ ఎఫ్ చెక్కులను బుధవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పట్టణ కాంగ్రెస్ నాయకులతో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ

దేశంలోనే తెలంగాణ రాష్ట్రం మెడికల్ హబ్‌గా మారిందని,వైద్యారోగ్య రంగంలో తెలంగాణ రాష్ట్రం సాధిస్తున్న ప్రగతి, ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిదాయకంగా మారిందని అన్నారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా రేవంత రెడ్డి బాధ్యతలు చేపట్టగానే రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచి ప్రజా ఆరోగ్య భద్రతపై ప్రభుత్వానికున్న చిత్తశుద్ధిని చాటుకున్నారని అన్నారు.మన ప్రాంతంలో వివిధ ఆరోగ్య సమస్యలతో చికిత్స తీసుకున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వార, ఎల్ఓసి ల ద్వారా ఇప్పటి వరకు 20 కొట్లు పై చిలుకు మంజూరు చేయడం జరిగిందని అన్నారు..పేదలకు వైద్య పరంగా ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు..

## వైద్య చికిత్సకు స్పందిస్తున్న కోడెలు

**- రాజన్న సిరిసిల్ల జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి**



**బలగం టీవీ, సిరిసిల్ల**

తిప్పాపూర్ లోనే గోశాలలో అనారోగ్యంతో ఉన్న కోడెలు వెటర్నరీ వైద్యులు అందించే చికిత్సకు స్పందిస్తున్నాయని , కొన్ని పశువుల యాక్టివ్ అయ్యాయని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అకాల వర్షాలు అనారోగ్య పరిస్థితుల కారణంగా తిప్పాపూర్ లోని గోశాలలో మొదటి రోజు 8 కోడెలు రెండవ రోజు 5 కోడెలు ,మూడవ రోజు 4 కోడెలు ,సోమవారం మరో 3 పశువులు, మంగళవారం 6 పశువులు మరణించడం జరిగిందని, బుధవారం నాడు ఒక పశువు మృత్యువాత చెందిందని మొత్తం గోశాలలో ఇప్పటి వరకు 26 పశువులు చనిపోయినట్లు తెలిపారు. గోశాలలో ఉన్న 1300 పశువులలో ప్రస్తుతం మొత్తం 14 కోడెలు అనారోగ్యంతో బాధపడుతున్నాయని, వీటికి వెటర్నరీ డాక్టర్లు వైద్యం అందిస్తున్నట్లు , వైద్యానికి పశువుల స్పందిస్తున్నాయని కొన్ని యాక్టివ్ గా తిరుగుతున్నయని, కోడెల ఆరోగ్య సంరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

## భూభారతితో దరణి కష్టాలు మటుమాయం..

**- పోరండ్ల రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి**

**బలగం టీవీ, పోరండ్ల**

ధరణి వల్ల రైతులు ఎదుర్కొంటున్న భూ సంబంధ సమస్యలు భూ భారతి చట్టంతో సమసిపోతాయని మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. తిమ్మాపూర్ మండలం పోరండ్ల గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో తెచ్చిన ధరణి వల్ల రైతులు పడిను కష్టాలు ఇన్నీ,అన్నీ కావన్నారు. ధరణి లోని లొసుగులను అవకాశంగా చేసుకొని గ్రామాల్లో కొందరు ఆక్రమణలకు తెగబడ్డారని, కాగా మరికొందరు అక్రమ బదలాయింపులకు పాల్పడ్డారన్నారు. దీంతో గ్రామాల్లో భూవివాదాలు పెచ్చుమీరిపోయాయని, హత్యలకు దారితీసిన సంఘటలు కూడా చోటుచేసుకున్నాయన్నారు. దరణిలోని లోపాల కారణంగా రైతులు, భూ యజమానులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకు వచ్చిన భూభారతి చట్టంతో రైతుల చిక్కులు తీరుతాయన్నారు. పదేళ్లుగా




ఎదుర్కొంటున్న భూసమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకు వచ్చిందని ఆయన వివరించారు.రైతులకు భూభారతి వరం లాంటిదని ఆయన పేర్కొన్నారు. రైతులకు సర్వరోగ నివారణిగా భూభారతి పని చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఎవరికైనా భూసంబంధ సమస్యలు ఉంటే ఈనెల 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

## ఆరు గ్యారంటీల అడ్రస్ ఎక్కడ..

**- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్ డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎన్నికల ముందు ఆరు గ్యారంటీలతో పాటు 420 హామీలు చెప్పి గద్దెనెక్కిన మీరు రాష్ట్రంలో ప్రతి ఒక్కరిని ఇబ్బందులకు గురి చేస్తున్నారు" అని కంచర్ల రవి గౌడ్ అన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా వృద్ధులకు రూ. 4000 పెన్షన్, మహిళలకు రూ. 2500 పెన్షన్, ధాన్యం కొనుగోళ్లపై రూ. 500 బోనస్, తులం బంగారం, యువతులకు స్కూటీలు, రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయలేదని ఆయన ప్రశ్నించారు. "రైతు భరోసా ఎక్కడ పోయాయి? పదిహేడు నెలలు గడుస్తున్నా వాటి ఊసే ఎత్తడం లేదు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ ఎప్పటికప్పుడు ప్రజల పక్షాన




నిలదీస్తుందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలయ్యే వరకు విడిచి పెట్టేది లేదని కంచర్ల రవి గౌడ్ స్పష్టం చేశారు. ఇప్పటికైనా ప్రజా సమస్యలపై దృష్టి సారించి, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ పథకాలు అమలయ్యే వరకు టీఆర్ఎస్ తరపున పోరాడతామని ఆయన పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో ముగ్దం అనిల్ గౌడ్, నాయకులు కొడం వెంకటేష్, వడ్లూరు సాయికుమార్, గాజుల మహేష్, కాసర్ల వినయ్, ఎండి అజ్జు, ఎస్.కె ఖలీల్, అడిగిప్పుల జగన్ తదితరులు పాల్గొన్నారు.

# ఈ విజయానికి ఆ ఇద్దరూ అర్హులే..




**బలగం టీవీ, హైదరాబాద్**

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఐపీఎల్ టైటిల్‌ను గెలిచిన సంగతి తెలిసిందే. అహ్మదాబాద్ వేదికగా పంజాబ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆరు పరుగులతో విజయం సాధించింది. దాదాపు 18 సంవత్సరాల నిరీక్షణకు తెర దించుతూ తొలిసారిగా టైటిల్‌ను సాధించింది. ఈ విజయంతో జట్టు సీనియర్ ఆటగాడు, మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ భావోద్వేగానికి గురయ్యాడు.కన్నీళ్లు పెట్టుకున్నాడు.

మ్యాచ్ తర్వాత విరాట్ మాట్లాడుతూ.. ఈ విజయాన్ని ఆర్‌సీబీ అభిమానులకు అంకితం చేస్తున్నట్లు ప్రకటించాడు. జట్టులో తన సుదీర్ఘ ప్రయాణాన్ని గుర్తు చేసుకున్నాడు. ఈ విజయం జట్టు సభ్యులతో పాటు 18 సంవత్సరాలు మద్దతు నిలిచిన ఆర్‌సీబీ అభిమానులదని.. తన యవ్వనం జట్టుకు ధారపోశానని, అనుభవం, విధేయతను జట్టుకు అంకితం చేశానని.. ఈ క్షణమే తనకు సర్వసమని విరాట్ పేర్కొన్నాడు. తన హృదయం, ఆత్మ రెండూ బెంగళూరుతోనే ఉన్నాయని.. తాను జట్టుకే విధేయుడిగా ఉన్నానని.. వేరే ఆలోచనలు వచ్చినా.. తాను వారితోనే ఉన్నానని.. వారు సైతం తనతోనే ఉన్నారన్నారు. ఈ విజయంలో గత కొన్నేళ్లు తనతో పాటు కలిసి ఆడిన ఏబీ డివిలియర్స్, క్రిస్ గేల్ సైతం సంబరాలు చేసుకునేందుకు అర్హులేనని పేర్కొన్నాడు. ఇద్దరు జట్టు కోసం ఎంతో కృషి చేశారని గుర్తు చేశాడు విరాట్. ఈ మ్యాచ్ ప్రత్యేకమవుతుందని.. మ్యాచ్ ప్రారంభానికి ముందే ఏబీతో అన్నానని.. అతనితో కలిసి సంబరాలు చేసుకోవాలని భావించినట్లు చెప్పాడు. ఎన్నోసార్లు ఏబీ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులు సాధించాడని.. నాలుగేళ్ల కిందట రిటైర్ అయినా అతని ప్రభావం జట్టుపై ఎప్పుడూ ఉంటుందని.. క్రిస్ గేల్ సైతం చాలా సీజన్స్ ఆర్‌సీబీ తరఫున ఆడాడని.. అందుకే నాతోపాటు వీరిద్దరూ ఈ విజయానికి అర్హులని భావిస్తున్నట్లు చెప్పుకొచ్చాడు. తన మనసంతా బెంగళూరుతోనే ఉంటుందని.. ఐపీఎల్‌లో తన చివరి రోజు వరకు ఆర్‌సీబీ తరఫునే ఆడతానని జట్టుకు చెప్పానని తెలిపాడు. అయితే, తాను ఎప్పుడు ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఉండాలనుకోనని.. 20 ఓవర్లు మైదానంలో ఉంటూ ప్రభావం చూపించాలనుకుంటానని.. తాను అలాంటి మనస్తత్వం కలిగిన ఆటగాడినని.. తనకు జట్టు మేనేజ్‌మెంట్ ఇచ్చిన మద్దతును మరిచిపోలేనని తెలిప్పాడు. జట్టులో మ్యాచ్ విన్నర్లు ఉన్నారని.. మ్యాచ్‌ను చివరి వరకూ తీసుకెళ్లే స్టార్ ఉన్నార చెప్పాడు. ఈ సమయంలో తాను ఎక్కువగా మాట్లాడలేనని.. ఆటగాళ్లతోపాటు కుటుంబ సభ్యులతో సెలబ్రేషన్స్ చేసుకోవడం బాగుందని.. నా కెరీర్‌లో ఎన్నో అద్భుతమైన జ్ఞాపకాలు ఉన్నాయని చెప్పాడు. ఇప్పటికీ టెస్టు క్రికెట్ అంటే చాలా ఇష్టమని.. ఈ ఫార్మాట్‌ను గౌరవంగా చూడాలని యువ క్రికెటర్లకు విరాట్ సూచించాడు.

# వైభవ్ సూర్యవంశీకి స్ట్రైకర్ ఆఫ్ ది సీజన్ అవార్డు

**బలగం టీవీ, హైదరాబాద్**



ఈ ఏడాది ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ జట్టుకు చెందిన వైభవ్ సూర్యవంశీ సంచలన బ్యాటింగ్‌తో అలరించిన సంగతి తెలిసిందే. ఈ 14 ఏళ్ల టీనేజ్ ఆటగాడు తన తొలి ఐపీఎల్ సీజన్‌లోనే స్టార్ బౌలర్ల బౌలింగ్‌లో సిక్సర్లను బాదాడు. దీని కారణంగా వైభవ్ సూర్యవంశీకి ప్రత్యేక బహుమతి లభించింది. వైభవ్ సూర్యవంశీకి స్ట్రైకర్ ఆఫ్ ది సీజన్ అవార్డు లభించింది. అవార్డుతో పాటు వైభవ్‌కు బహుమతిగా టాటా కర్వ్ కారు కూడా లభించింది. ఐపీఎల్ 2025లో వేగంగా బ్యాటింగ్ చేస్తూ వైభవ్ సూర్యవంశీ 7 మ్యాచ్‌ల్లో 252 పరుగులు చేశాడు. ఇందులో తుఫాను సెంచరీ కూడా ఉంది. ఈ సమయంలో వైభవ్ స్ట్రైక్ రేట్ 206.55గా ఉంది. ఈ సీజన్‌లో వైభవ్ సూర్యవంశీ 122 బంతులు ఎదుర్కొని 24 సిక్సర్లు, 18 ఫోర్లు కొట్టాడు.

# 'మాలిక్' టీజర్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**




బాలీవుడ్ నటుడు రాజ్‌కుమార్ రావు ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'మాలిక్ ఈ సినిమాకు పుల్కిత్ దర్శకత్వం వహిస్తుండగా.. టిప్స్ ఫిల్మ్స్, నార్తర్న్ లైట్స్ ఫిల్మ్స్ బ్యానర్లపై కుమార్ తౌరానీ, జే షెవాక్రమణి నిర్మిస్తున్నారు. మానుషి చిల్లర్ కథానాయకగా నటిస్తుండగా.. ప్రసేన్‌జిత్ ఛటర్జీ, మేధా శంకర్ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం జూలై 11న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. టీజర్ చూస్తుంటే.. ఈ చిత్రం 1988 అలహాబాద్ నేపథ్యంతో కూడిన అండర్‌వరల్డ్ డ్రామాగా తెరకెక్కినట్లు తెలుస్తోంది. సామాన్య యువకుడి నుంచి ఒక వ్యక్తి గ్యాంగ్‌స్టర్‌గా ఎలా మారాడు అనేది ఈ సినిమా స్టోరీ అని సమాచారం.



# రెమ్యునరేషన్ రూ.11 కోట్లు వెనక్కిచ్చేసిన పవన్ కళ్యాణ్..!

**బలగం టీవీ, హైదరాబాద్**

పీ డిప్యూటీ సీఎం, పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హరిహరవీరమల్లు సినిమా కోసం తీసుకున్న పారితోషికం మొత్తాన్ని చిత్రనిర్మాత ఏఎం.రత్నంకు తిరిగి ఇవ్వాలని నిర్ణయించినట్టు సమాచారం. నిర్మాత ఏఎం.రత్నం ఇబ్బందులు చూసిన పవన్ కల్యాణ్ తన రెమ్యునరేషన్ దాదాపు రూ.11 కోట్లు వెనక్కి ఇచ్చేసినట్లుగా వార్తలు వెలువడుతున్నాయి. హరిహర వీరమల్లు సినిమా ఈ జూన్ 12న విడుదల కానుంది. ఈ పిరియాడికల్ యాక్షన్ డ్రామాను క్రిష్ జాగర్లమూడి ప్రారంభించగా, జ్యోతి క్రిష్ణ పూర్తి చేశారు. 2020లో ఈ సినిమా ప్రారంభం కాగా, ఎక్కువ కాలం సెట్స్‌పైనే ఉండిపోయింది. పవన్ కల్యాణ్ రాజకీయంలో బాగా బిజీ కావడంతో సినిమా మరింత ఆలస్యమవుతూ వస్తుంది. ఈ కారణంగా కొన్ని నెలల పాటు షూటింగ్ వాయిదా పడింది. ఇటీవల చిత్రీకరణ పునః ప్రారంభం అవ్వగా, రీసెంట్‌గా షూటింగ్ కంప్లీట్ అయ్యింది. అయితే సినిమా ఆలస్యం కావడం వల్ల ప్రొడక్షన్ కాస్ట్ పెరిగింది. దీంతో నిర్మాత పరిస్థితులను అర్థం చేసుకున్న పవన్ మంచి మనసు చాటుకున్నారు.



# మహిళల ఆసియా కప్ హాకీ టోర్నమెంట్ షెడ్యూల్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

మహిళల ఆసియా కప్ హాకీ టోర్నమెంట్ షెడ్యూల్ విడుదలైంది. చైనాలోని హంగ్జౌ వేదికగా సెప్టెంబర్ 5 నుంచి జరగనుంది. 10 రోజుల పాటు జరుగనున్న ఆసియా కప్‌లో మొత్తం 8 జట్లు టైటిల్ కోసం పోటీ పడనున్నాయి. గ్రూప్ బీలో చోటు దక్కించుకున్న భారత జట్టు తొలి పోరులో థాయ్‌లాండ్‌ను ఢీ కొట్టనుందని బుధవారం హాకీ ఇండియా వెల్లడించింది. గత ఎడిషన్‌లో కాంస్యం సాధించిన టీమిండియా ఈసారి పసిడిపై గురి పెట్టింది. ఇక ఈ టోర్నీలో విజేతగా నిలిచిన జట్టు 2026 మహిళల ఎఫ్ఐహెచ్ వరల్డ్ కప్ పోటీలకు నేరుగా అర్హత సాధించనుంది.

సెప్టెంబర్ 6న జపాన్‌తో..

ఆసియా కప్ పోటీలకు అర్హత సాధించిన జట్లను గ్రూప్ ఏ, గ్రూప్ బీలుగా విభజించారు నిర్వాహకులు. పూల్ – ఏ లో చైనా, కొరియా, మలేషియా, చైనీస్ తైపీ జట్లకు చోటు దక్కింది. పూల్ – బీలో భారత్, జపాన్, సింగపూర్, థాయ్‌లాండ్ జట్లు ఉన్నాయి. తొలి మ్యాచ్‌లో భారత జట్టు థాయ్‌లాండ్‌తో తలపడనుంది. సెప్టెంబర్ 6న డిఫెండింగ్ ఛాంపియన్ జపాన్, సెప్టెంబర్ 8న సింగపూర్‌తో అమీతుమీ తేల్చుకోనుంది టీమిండియా. ఫైనల్‌కు చేరడంతో పాటు ట్రోఫీ గెలవాలనే కసితో ఉన్నాం. తద్వారా 2026 మహిళల ఎఫ్ఐహెచ్ వరల్డ్ కప్ పోటీలకు అర్హత సాధించాలనేది మా ప్రధాన ఉద్దేశం' అని భారత సారథి సలీమా టెటే వెల్లడించింది. 2017లో చివరిసారిగా భారత జట్టు ఆసియా కప్ విజేతగా నిలిచింది.




# మ్యాడ్ నెస్ మొదలైంది

**బలగం టీవీ, హైదరాబాద్**

బన్నీ వాస్ వర్క్స్‌తో కలిసి నవతరం నిర్మాణ సంస్థలు సప్త అశ్వ క్రియేటివ్స్ మరియు వైరా ఎంటర్టైన్మెంట్స్ ఒక ఆసక్తికర చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. తాజాగా ఈ చిత్రం నుంచి కట్టిపడేసే ప్రీ–లుక్ పోస్టర్ విడుదలైంది. తాజాగా ఆవిష్కరించబడిన ఆసక్తికరమైన ప్రీ–లుక్ పోస్టర్.. ఉత్సుకతను రేకెత్తించడంతో పాటు, నవ్వులను చిందించేలా ఉంది. ఎరుపు రంగు టోపీలు, నీలిరంగు ముసుగులు ధరించి వరుసగా నిల్చొని ఉన్న కొందరు వ్యక్తులతో కూడిన ఈ పోస్టర్.. ఫన్, మిస్టరీ, మ్యాడ్ నెస్ తో రోలర్‌కోస్టర్‌ను సూచిస్తుంది. జూన్ 6న ఫస్ట్ లుక్‌ని విడుదల చేయనున్నట్లు పోస్టర్‌లో ప్రకటించిన నిర్మాతలు.. సరికొత్త వినోదాత్మక చిత్రాన్ని అందించనున్నట్లు హామీ ఇచ్చారు. ఈ చిత్రంతో విజయేంద్ర ఎస్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు.



# దుబాయ్‌లో సమంత సందడి

**బలగం టీవీ, హైదరాబాద్**

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత దుబాయ్‌లో సందడి చేసింది. ఓ ఈవెంట్‌కు హాజరైన ఆమె గోల్ట్ కలర్ శారీలో మెరిసింది. సింపుల్ మేకప్, హెయి స్టైల్‌తో తన లుక్‌కు మరింత అందంగా మార్చుకని ఆకట్టుకుంది. ఇందుకు సంబంధించిన ఫోటోలను తన సోషల్ మీడియా ఖాతాల్లో షేర్ చేసింది సమంత. ఇవి ప్రస్తుతం వైరలవుతున్నాయి. ఈ సందర్భంగా సమంతను చూసేందుకు అభిమానులు పోటీ పడ్డారు. ఈ సందర్భంగా అందరితో కలిసి సరదాగా ఓ సెల్ఫీ దిగింది సామ్.

ఇక సమంత మళ్లీ సినిమాలతో బిజీ అయ్యేందుకు ప్రయత్నిస్తోంది. ఇటీవల ఆమె నటించి, నిర్మించిన శుభం సినిమాకు పాజిటివ్ టాక్ వచ్చింది. ఇక సమంత ప్రస్తుతం 'రక్త్ బ్రహ్మాండ్: ది బ్లడీ కింగ్‌డమ్' అనే కొత్త వెబ్ సిరీస్ లో నటిస్తోంది. ఇప్పటికే చాలా భాగం ఈ సిరీస్ పూర్తయినట్లు తెలుస్తోంది.



**ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగార్జున బుధవారం తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను ఉప ముఖ్యమంత్రి అధికారిక నివాసంలో కలిశారు. తన చిన్న కుమారుడు, యువ హీరో అక్కినేని అఖిల్ వివాహ మహొత్సవానికి హాజరు కావాల్సిందిగా ఆహ్వానించారు. అఖిల్ వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు.**

# 'హరిహర వీరమల్లు' ప్రీ రిలీజ్ ఈవెంట్ వాయిదా

**బలగం టీవీ, హైదరాబాద్**




ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పవర్ స్టార్ పవన్ కల్యాణ్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'హరిహర వీరమల్లు' ప్రీ రిలీజ్ ఈవెంట్ వాయిదా పడింది. తిరుపతిలోని ఎస్వీయూ తారకరామ క్రీడా మైదానంలో ఈ నెల 8న ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించాలని భావించారు. అయితే, అనివార్య కారణాల వల్ల ప్రస్తుతానికి వాయిదా వేస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు. తదుపరి తేదీని త్వరలో ప్రకటిస్తామని వెల్లడించారు. ఈ నెల 12న ప్రపంచ వ్యాప్తంగా సినిమా విడుదల కావాల్సి ఉంది.అయితే సినిమా విడుదల కూడా వాయిదా పడినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ప్రముఖ నిర్మాత ఏఎం రత్నం నిర్మాణ సారథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రానికి ప్రముఖ దర్శకుడు క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించగా, జ్యోతి కృష్ణ దర్శకత్వ పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహించారు.